గాజుకళ్ళు

ముప్పాళ్ళ జగన్నాధరావు

“మీ రెన్నయినా చెప్పండి, నసేవిఁరా నేనీ పెళ్ళి చేసుకోను - అంతే” అప్పుడే పెళ్ళివార్ని వీధిగుమ్మం వరకు సాగనంపి వచ్చిన వెంకట్రామయ్యగారి చెవినబడ్డాయి. సుశీల అయిష్టంగా అన్న మాటలు।

“ఇంకే వుంది హతోస్మి. దీనికి ఈ సంబంధం కూడా నచ్చలేదన్నమాట” వెంకట్రామయ్య ముఖంలో ఈసారి కూడా ముడుతలేర్పడ్డాయి.

“అయితే మళ్ళీ ఇంకో చెప్పులజత అరగటం ఖాయం” అంటూనే చిరాగ్గా ఇంట్లోకి నడిచాడు.

“ఒసేవ్ సుశీ ఎందుకు చేసుకోవేఁ? ఆ అబ్బాయికి ఏం లోటని? కన్నొంకరా కాలొంకరా చెప్పు। తెచ్చిన ప్రతి సంబంధాన్ని ఇలా ఏదో ఒక సాకుజెప్పి వద్దంటే ఎలా నేతల్లీ।” కత్తిపీట ముందుకూర్చుని ఏదో తరుగుతూ అంది సుభద్రమ్మ-

“నీకు తెలియదే అమ్మా। నిజం చెప్పాలంటే, నాకు తెలిసినంతలో శేఖరం బుద్ధిమంతుడు - ఇద్దరం కలిసి చదువుకునే రోజుల్లో అతని విషయం నాకు బాగా తెలుసు। ఇది సుఖపడాలనే ఆఖరు ప్రయత్నం చేశాను।”

తల దువ్వుకుంటున్న వాడల్లా ఆగి అన్నాడు రఘు :

"అవున్లే మీ కళ్ళకు అందరూ బాగుంటారు. ఎందుకో చెప్పనా. ఏదో విధంగా నన్ను వదిలించుకోవాలని మీ తపన, అంతేకదూ ?"_ సురసుర మంటూ అనేసింది సుశీల :

"సుశీ _ పొరబడుతున్నావు చెల్లాయి! నిన్ను వదిలించుకోవాలని తపనే మాకుంటే _ ఇంత నిరీక్షణ ఎందుకు చెప్పు. నువ్వు సుఖపడాలనేకదామ్మ : అయినా ఆ శేఖరానికి ఏం లోటు చెప్పు. బి. ఏ. చదువుకున్నాడు. వెనక ఆస్తి కూడా బాగానే వుంది, ఇంటిపెత్తనం అంతా అతన్దే! కాకపోతే మనిషి కాస్త నలుపు అంతేగా ?"_

"అన్నయ్యా ! అసలు పెళ్లి చేసుకునేది నువ్వా నేనా ?" అంది సుశీల.

"ఏవిటే ఆ తలబిరుసు చిన్నా పెద్దా లేకుండా ?" అని మందలించబోతున్న సుభద్రమ్మ కంఠాన్ని వెంటనే ఆపింది సుశీల.

"అవున్లే అతగాడు మీ కళ్ళకు మన్మధుడిలా కనిపిస్తున్నాడు. అబ్బ తల్చుకుంటేనే కంపరం పుడుతోంది. ఆ కారునలుపు, స్ఫోటకం మచ్చలు, ఎంత భయంకరంగా వుంటాడో _ ఆ అవతారాన్ని కట్టుకుని జీవితాంతం నరకం అనుభవించాలా ? నావల్లకాదు, ఛస్తే ఆ మొద్దును చేసుకోను."

—అంతవరకు గుమ్మం ముందు నిల్చుని, వీళ్ళ సంభాషణంతా వింటున్న తండ్రి ముఖంలోకి కొరకొరా చూసి ప్రక్క_గదిలోకి వెళ్లింది సుశీల.

"అయినా దాన్నేం లాభంలెండి, ఇంతింత చదువులు వద్దుమొర్రో అంటే విన్నారు ? పట్టుపట్టి మరీ చదివించారు. ఇప్పుడు చూడండి ఇది ఎలా తయారయిందో" అంది భర్తను దెప్పుతూ సుభద్రమ్మ.

"అయితే ఏవిటమ్మా_చదువుకుంటె మాత్రం, అంతా దీనిమాదిరిగానే వున్నారా ? ఆ సుబ్బరామయ్యగారి కూతురు కూడా బియ్యే చదివింది. అయితే మాత్రం తండ్రి మాట కాదందా? ఏపంత గొప్ప సంబంధం అది. పెళ్లి చేసుకుని నిక్షేపంలా కాపురం చెయ్యటం లేదూ ?" అన్నాడు రఘు.

"అవునా అబ్బాయ్ ! పెద్దవాళ్ల పరిస్థితి అకళింపు చేసుకుంది కనుకనే సుఖంగా బ్రతుకుతోంది." సుభద్రమ్మ మాట పూర్తికాకుండానే,

"అవునమ్మా నువ్వన్నట్టు ఎంతో సుఖంగా బ్రతుకుతుంది. ముష్టి మూడొందల రూపాయిల జీతంతో, కోరిన బట్ట కట్టలేక, నచ్చిన నగలు చేయించుకోలేక, చచ్చీ చెడి ఎలాగో ధర్మసూత్రానికి కట్టుబడి బ్రతుకుతుంది. అదీ ఒక బ్రతుకేనా? అట్టాంటి మిడి మిడి బ్రతుకులు నాకు నచ్చవ్ !" గది

లోంచి వస్తూనే ఉ|క్రో షం పట్టలేక ఆశిసించి సుశీల! వెంటనే సమయం చూసి అందుకున్నాడు రఘు!

"అయితే నువ్వన్నట్టు ఈ సంబంధం ఆర్థికలోపం లేదేగా? చేసుకో నువ్వనుకున్న కోరికలన్నీ తీరతాయి!"

"అన్నయ్యా!- కేవలం డబ్బుతోటే అన్ని సమస్యలు తీరిపోవు. ముఖ్యంగా అతను నాకు నచ్చలేదు. ఇప్పుడు చెబుతున్నాను విను! అందంగావున్న ఆస్తి పరుడైతే నేను తప్పకుండా చేసుకుంటాను." సుశీల నిర్ణయానికి రఘు ఏదో అనబోయాడు!

"పోన్లెండి తనకు నచ్చనప్పుడు బలవంతపెట్టడం ఎందుకు?"

పెరట్లోనుండి నీళ్లబిందెతో వస్తూ అంది రఘు భార్య గిరిజ, భర్తని ఉద్దేశించి

"అంటే నువ్వు ఆడపడుచని వెనకేసుకొస్తున్నావన్నమాట!"

"బావుందండీ, ఇందులో వెనకేసుకురావటమేముంది! ఉన్నమాటే అంటున్నాను!" అంటూనే వంటగదిలోకి నడిచింది గిరిజ!

"ఏవోం ఏం చేసుకుంటారో — మీ ఇష్టం. నేను చెప్పదల్చుకుంది చెప్పేను" —చరచరా బయిటికి నడిచేడు రఘు!

"ఛీ ఛీ దీనికసలు కల్యాణరేఖ ఉందో లేదోగాని ఇంటిల్లపాదినీ వేధించుకు తింటోంది- ఏమండోయ్ మిమ్మల్నే వింటున్నారా? మీ ముద్దుల కూతురి నిర్ణయం!"- అంతవరకు గోడవార్న పడకుర్చీలో సేద దీర్చుకుంటున్న భర్త వెంక|టామయ్యను ఉద్దేశించి అంది సుభ|ద్రమ్మ.

"పోనీలేవే నువ్ నోరుచేసుకుంటావెందుకు? దానికి ఇష్టం లేనప్పుడు మనం బలవంతం చెయ్యటం కూడా అంత మంచిది కాదు!- ఏమ్మా సుశీ! చూడు తల్లీ, నీ ఇష్టానికి వ్యతిరేకంగా ఏ పనీ జరగదు. అయినా ఒక తూరి ఆలోచించడం మంచిదేమోనని! అహాం ఎందుకంటె, కు|ర్రవాడు కాస్త నలుపే అనుకో -అయినా మంచివాడు, తెలివైనవాడు అని విన్నాను."

-ఆశగా నసిగేడు వెంక|టామయ్య!

"ఇంక — ఆలోచించేదేవుంది నాన్నా. ఈ సంబంధం నాకిష్టంలేదని చెప్పేనుగా" ఖచ్చితంగా తన నిర్ణయం చెప్పేసి అక్కడ్నుంచి వెళ్లిపోయింది సుశీల.

* * *

వెంక|టామయ్యగారి |శమ ఫలితంగా విశాఖపట్నంనుండి మరో సంబంధం వచ్చింది - అబ్బాయి, సుశీల ఊహించినట్టే అందంగా ఉన్నాడు పెద్దగా చదువులేకపోయినా. పెద్ద వ్యాపారమే చేస్తున్నాడు. అతను అన్ని విధాల సుశీలకు బాగా నచ్చాడు - పేరుకు తగ్గట్టే అందంగా ఉన్నాడు, చదువు లేకపోతేనేం! అందం వుంది ఆస్థి వుంది.

నేను సుఖపడ్డానికి ఇంతకన్నా ఇంకేం కావాలి! తనకు కాబోయే భర్తను మన స్సులో ఊహించుకుంటూ ఆనందంతో పొంగిపోయింది సుశీల!

* * *

సుశీల ఎన్నో ఆశయాలు హృదయంలో రంగరించుకుంటూ అత్తవారింట్లో అడుగుపెట్టింది. కాని తను ఊహించుకున్నంతగా అక్కడి పరిస్థితులు అనుకూలించలేదు. ఆ ఇల్లు ఓ సత్రంలా అనిపించింది. వచ్చిన వారంరోజుల్లోనే ఆ ఇంటి పరిస్థితిని, అక్కడి మనుష్యుల మనస్తత్వాల్ని యింతగా తెలుసుకుంది. పెద్ద ఆడపడుచు భర్తతో తగాదాపెట్టుకుని రెండు సంవత్సరాల క్రితంనుండే, తన ముగ్గురు పిల్లల్తో వచ్చి అక్కడే వుంటోంది_ ఇహ రెండో ఆడపడుచు, భర్తను పోగొట్టుకుని, అత్తవారింటికి శాశ్వతంగా దూరమై తన ఇద్దరు పిల్లల్తో సంవత్సరం నుండి అక్కడే వుంటోంది. మూడో ఆడపడుచు కింకా పెళ్ళికాలేదు! చదువు పూర్తయితేనేగాని పెళ్ళి చేసుకోదట!_ ఇంకా ఇద్దరు మరుదులున్నారు! అదేదో కాలేజీలో చదువుతున్నారన్న మాటేగాని, ఒక్క క్షణం ఇంటిపట్టు నుండరు. ఇహపోతే తన భర్త రాజా. అతనుచేసే వ్యాపారం ఏమిటో ఎవ్వరికీ తెలియదు. తరచు ఇంటికి రావటంకూడా అతనికి అలవాటు లేదు. అసలు ఆ యింట్లో ఉన్నవాళ్ళందరూ ఎవరు ఎందుకు బ్రతుకుతున్నారో తలబాదుకున్నా సుశీలకి ఎంతకీ అర్థంకాలేదు! పోనీ అత్తగారి విషయం చూస్తే _ అంత వయసొచ్చిందన్న మాటేగాని, ఇంకా చెత్త పుస్తకాలు చదువుతూ _ సినిమాల గురించి పిల్లల్తో సమానంగా వాదించడం ఆమెకు పరిపాటి. వాళ్ళంతా ఎంతో నాగరికులైనట్టు సుశీలను ఏహ్యంగా చూడసాగేరు. పెళ్ళిచూపులకని వచ్చినప్పుడు మెడతిరక్కుండా నగలు పెట్టుకొచ్చారు. ఇప్పుడు వంటిపేట గొలుసులు మాత్రమే కనబడుతున్నాయి! అవి కూడా అసిలీవో నకిలీవో_సుశీలకి ఇంకా అర్థంకాలేదు. పైగా ఇప్పుడుంటున్న మేడ కూడా, ఇరవైవేల వరకు అప్పులో వుందట. ఇన్ని లోటుపాట్లు పైకి తెలియకుండా వీళ్ళు ఎలా బ్రతుకుతున్నారని సుశీల ఆందోళన!

కాలం దొర్లిపోతున్నకొద్దీ సుశీల పరిస్థితి మరీ నీచంగా తయారైంది! అత్తగారి సాధింపులు, ఆడపడుచుల అదిరింపులు, మరుదుల వెటకారాలు రాను రాను మరీ ఎక్కువైనాయి!

ఆ ఇంట్లో అందరూ సుశీలను పని మనిషికంటే హీనంగా చూస్తున్నారు. భర్త రాజా ఏ రాత్రి పన్నెండుగంటలకో తప్పతాగి రావటం సుశీలను బాదటం అతనికి అదో సరదా. సుశీల పుట్టింటి నుండి తెచ్చుకున్న నగలన్నీ ఒకొక్కక్క_



టిగా అన్నీ హరించేశాడు. ఈ జరిగిన కొన్నేళ్ళలో ఆమె బాధలు ఎక్కువైనయ్‌గాని తగ్గలేదు.

పగలు జరిగిన ప్రతి ఒక్క విషయం గురించీ భర్త రాగానే ఎవరో ఒకళ్లు చిలవలుపలవలు అల్లి చెప్పడం, అతను అదే విధంగా భావించి సుశీలను హింసించడం – పువ్వులాంటి సుశీల శరీరం అతని మొండితనానికి ఏనాడో మొద్దుబారిపోయింది. నెమ్మదిగా అలవాటు కూడా చేసుకుంది, స్వయంకృతాపరాధంగా భావించి !

ఈ పెళ్ళి ఐన ఏడేళ్లలో పుట్టింటికి ఏ రెండుమూడుసార్లో వెళ్లింటుంది. అదైనా భర్త పెట్టిన గడువు మించకుండా! ఈ మధ్య రెండేళ్ళ నుంచి ఆ అదృష్టానిక్కూడా నోచుకోలేదు ? చేసేది లేక బ్రతుకుమీద ఆశ వదులుకుని శ్శవంలా బ్రతుకుతూ గంటలకొద్దీ ఒంటరిగా కూర్చుని ఏడవడం – తన పాత జీవితం గుర్తురాగానే తన తెలివి తక్కువతనానికి నవ్వుకోడం, ఎక్కువ ఫలితం ఆశించుకున్న తన్ని తానే తనివి తీర తిట్టుకోడం, తనపట్టుదల కారణంగా తన జీవితం ధ్వంసం అయినందుకు – నిష్కృతి లేదు – అని కుళ్లిపోవడం :– తన బాధ ఆ ఇంట్లో ఎవరితో చెప్పుకున్నా అరణ్యరోదనే అయింది.

* * *

ఈసారైనా సుశీలను పుట్టింటికి తీసుకు వెళదామని వచ్చారు వెంకట్రామయ్యగారు. మొదట రాజా ఒప్పుకోకపోయినా, మోటర్ సైకిల్ నిమిత్తం ఆరువేలు ఇస్తానడంతో తప్పనిసరై ఒప్పుకున్నాడు....

పుట్టింటి కొచ్చిందన్న మాటే గాని ఆమెలో ఆనందాన్ని మచ్చుకైనా చూడ

లేకపోయారు- ఆ ఇంట్లోవాళ్ళందరూ. బంగారు బొమ్మలా వుండే సుశీల చిక్కి పాలిపోవడంలో సుభద్రమ్మ గుండె నీరై పోయింది. సుశీల అత్తవారింట్లో పడుతున్న బాధలన్నీ క్షణంలో ఊహించ గలిగింది.

పెంకితనంగా, మొండి పట్టుదలతో ఉండే సుశీల అత్తవారింటి కెళ్ళేక, ఇంత సాధువుగా మారిపోవటం గిరిజకు ఆశ్చర్యాన్ని కలిగించింది

గడుస్తున్న ప్రతి ఒక్క రోజు సుశీల ఆరోగ్యం క్షీణిస్తూనే వుంది.

"ఏ వ్యాధీలేదు కేవలం మనోవేదన తప్ప" అంటున్నారు డాక్టర్లు. ఈ పరిస్థితిలో సుశీలను అత్తవారింటికి పంపించటం సుభద్రమ్మకు ఎంత మాత్రం ఇష్టంలేదు - ఇక్కడి పరిస్థితి అర్థమయ్యేలా రాజాకు కబురు పెట్టేడు రఘు.

సుశీల పరిస్థితి అర్థంచేసుకున్న గిరిజ - సుశీలను అలా బజారుదాకా వెళ్దాం రమ్మని వెంట పెట్టుకెళ్ళింది. సుశీల ఏదో ధ్యానంలో పరాగ్గా గిరిజ ననుసరించి నడుస్తోంది. "హల్లో సుశీ" అంటూ ఎదురుగా వచ్చి ఆపింది రమ. సుశీల ఆశ్చర్యంగా చూస్తూ అలానే వుండి పోయింది!

"అదేంటివే సుశీ రాయిలా వుండి పోయావ్? నేనే రమని."

"నువ్వా రమా" అంది ఆశ్చర్యం నుంచి తేరుకుని సుశీల.

"అవును నేనే! ఏవిటే ఇది. బంతి పువ్వులా వుండేదానివి ఇలా కురూపిలా తయారయ్యావే?"

"ఏం ఎలా తయారయ్యాను? బాగానే వున్నానుగా!"

"నీ ముఖం- బి. ఏ. చదివే రోజుల్లో ఇలానే వుండేదానివా? నేనే మొగాడ్ని యితే ఈ లోకంలో నిన్ను తప్ప మరె వర్నీ చేసుకోను- అనేదాన్ని గుర్తుందా?" -రమ అంటున్న మాటలు వింటూ, పాత విషయాలు గుర్తు తెచ్చుకుని పరాగ్గా ఉండిపోయింది సుశీల.

"ఏయ్! ఏవిటా పరాకు? అఁ, మనం చదువుకొనే రోజుల్లో ఎంత స్నేహంగా వుండేవాళ్ళం! ఊఁ, మళ్ళీ ఇన్నాళ్ళకు కలుసుకున్నాం! ఏయ్ నిన్నే మాట్లాడవేఁ!" రెట్టించింది రమ.

"ఊఁ చెప్పు-"

"అన్నట్టు నీ సంగతి అడగడం మర్చిపోయేను."

"ఏముంది నాకు పెళ్లి అయింది. అత్తవారిది విశాఖపట్నం. పండక్కి నాన్నగారు తీసుకొచ్చారు?" అంది, తన ముఖంలో ఏలోటు కనిగడుతుందో నని భయపడుతూ ముక్తసరిగా సుశీల.

"అవునే సుశీ రేపు మా ఇంటికి రాకూడదూ. అన్ని విషయాలు తీరుబాటుగా మాటాడుకుందాం. అన్నట్టు రేపు

అదివారం కదూ, మా వారు కూడా ఇంట్లోనే వుంటారు. నీకు పరిచయం చేస్తాను!" అంది రమ.

"అలాగే."

"తప్పకుండా రావాలి మరి" అంటూ తన అడ్రస్ చిన్న స్లిప్‌మీద రాసి, సుశీలకిచ్చి వెళ్లిపోయింది రమ. అంతవరకు ఫ్యాన్సీషాపులో ఏవో కొని గిరిజ తిరిగొచ్చేంతవరకు సుశీల ఒంటరిగా ఫుట్‌పాత్‌మీద నిల్చుంది.

"ఏవమ్మా మరదలా మీ స్నేహితు రాలు వెళ్లిపోయిందా?" అన్న వదినగారి పిలుపుతో, ఆలోచనల నుండి తేరుకుని ఆమెతో ఇంటిదారి పట్టింది సుశీల!

* * *

రమ ఇచ్చిన అడ్రస్ ప్రకారం రిక్షా దిగి ప్రహరీ గేటు దాటి లోనికి నడిచింది సుశీల. అబ్బ చిన్న పూలతోట ఎంత ముచ్చటగా వుంది! చిన్న డాబా ఇల్లయినా ఎంత అందంగా వుంది! మనసులో ఊహించుకుంటూ మరో రెండడుగులు ముందుకు నడిచింది. ప్రక్క కటకటాల గదిలో ఎవరో ఓ ముసలతను చంటిదానికి ప్రయివేటు చెబుతున్నాడు. మరో అతను వరండాలో వాలుకుర్చీలో కూర్చుని పేపరు చదువుతున్నాడు. తన రాకను ఎవరూ గమనించలేదు. ఆ శబ్దానికి పేపర్ చదువుతున్న వ్యక్తి ఉలిక్కిపడి, గబగబా వరండా మెట్లుదిగి సుశీల నిల్చున్న స్థలంవరకు వచ్చి ఆగిపోయాడు. ఆమెను చూస్తే అతని నోటివెంట మాటలు పెగలేదు. సుశీల పరిస్థితి కూడా అలానే వుంది! ఆశ్చర్యపోయి ఆయన ముఖంలోకే చూస్తూ అలానే నిల్చుండిపోయింది. ఎన్నో రకాల ఆలోచన్లు ఆమెను చుట్టుముట్టాయి. ఆయనే కదూ- ఆయనే. సందేహం లేదు. ఈయనే శేఖర్! ఆనాడు నేను తిరస్కరించింది ఈయన్నే కదూ, అయితే ఈయన్ని రమ పెళ్లి చేసుకుందా?"

మనస్సంతా ఆందోళనతో నిండిపోయింది. ఒక్క నిమిషం కూడా అక్కడ ఉండాలనిపించలేదు! తను వెంటనే తిరుగుముఖం పట్టేంతలో ఆయన తేరుకున్నాడు!

"రండి- లోపలికి రండి! ఇంతవరదాక రమ మీకోసవే ఎదురుచూస్తోంది" అంటూ లోనికి దారితీశాడు. వేరే గత్యంతరంలేక అనుసరించింది సుశీల! "రమా-రమా-నీ ఫ్రెండ్ వచ్చిందోయ్" పెద్దగా కేకపెట్టాడు శేఖర్! రమ చేతులు తుడుచుకుంటూ వచ్చి సుశీలను లోనికి తీసుకుపోయింది!- చిన్నాడు కర్ర గుర్రంమీద పృథ్వీరాజులా ఫోజు పెట్టి ఊగుతున్నాడు. "ఓసేవ్ సుశీ వాడు మా చిన్నాడు, పెద్దది అమ్మాయి. బయట ప్రయివేటు చదువుకుంటోంది! దాని తరువాత వీడు- అంతే,

కుటుంబ నియంత్రణ అసలు

జరిపేశాం!" పెద్దగా నవ్వింది రమ! సుశీల తను తెచ్చిన స్వీట్ పేకెట్ కుర్రాడికి అందించింది! వాడు ఎర్రగా బొద్దుగా ముద్దుగా వున్నాడు! కాస్సేపు ఎత్తుకుని ముద్దాడి దించింది.

"రమా నేనలా బజారువేపు వెళ్ళొస్తానోయ్?" అన్నాడు ఇంతలో శేఖర్.

"త్వరగా వచ్చేసేయండి.సుశీలకూడా ఈపూటకు ఇక్కడే వుంటుంది" అన్నది రమ!

"అబ్బే ఎందుకు? వద్దు, అమ్మ నాకోసం ఎదురుచూస్తూ వుంటుంది" మొహమాటపడుతూ అన్నది సుశీల!

"అదేంవిటి! మరేం ఫరవాలేదు! అంతగా అయితే మీ ఇంటికి నేను కబురు పెడతాలెండి!" అన్నాడు శేఖర్!

ఇహ తప్పదన్నట్టు ఊరుకుంది సుశీల. తన ఇంటి అడ్రస్ చెప్పబోగా

"నాకు తెలుసులెండి"— అంటూ వెళ్ళిపోయాడు శేఖర్. సుశీల ముఖం చిన్నబోయింది. అంతలోనే తేరుకుని ఇల్లంతా ఒకసారి కలియజూసింది. ఆధునిక పరికరాలతో ఆ ఇల్లు ఎంతో అందంగా వుంది!

"ఇల్లు చాలా నీటుగా సర్దావు రమా."

"ఈ ఇల్లు ఈ మధ్యనే కొన్నాం. అయినా నా బొందనా ఇంత ఓపికొక్కడానా? అన్నీ ఆయనే సర్దుకుంటారు! ఆయనకి పూలతోటలు పెంచటవన్నా ఇల్లు నీటుగా సర్దటమన్నా ఎంత సరదా అనుకున్నావ్! చూడు ఎక్కడి దక్కడ అమిరినట్టు ఎంత చక్కగా సర్దారో" భర్త గొప్పతన్నాన్ని చాటిచెబుతూ గర్వంగా అంది రమ!

"అయితే అదృష్టవంతురాలవే."

"నిజంగానే— నేను అదృష్టవంతురాల్ని కనకనే ఇంత మంచివారికి భార్యను కాగలిగాను. ఎప్పుడూ మా ఇద్దరిలో ఏ విధమైన బేధాభిప్రాయాలు రావంటే నమ్ము.ఏదైనా సమస్య వచ్చిందే అనుకో, ఇద్దరం కలిసి ఆలోచించి మంచి చెడ్డలు నిర్ణయించి ఆచరిస్తాం. ఒకొక్కప్పుడు నా సలహాలే ఆయ నెక్కువ పాటిస్తూ వుంటారు. అవునే అన్నట్టు అంతా నా గురించే చెప్పుకుపోతున్నాను. నీ గురించి ఒక్క మాటకూడ అడగలేదు. ఇంతకీ మీవారేం చేస్తుంటారే— మంచివారేనా?" డైనింగ్ టేబిల్ మీద అన్నీ సర్దుతూ యాంత్రికంగా చెప్పుకుపోతోంది రమ.

సుశీల ముఖం కరుడుగట్టింది. ఆమె ముఖంలో విషాదచ్ఛాయలు కొట్టొచ్చినట్టు కనబడుతున్నాయి రమకి!

"పోనీలేవే— నీ మనసు కలతపెట్టినట్టున్నాను! వద్దులే చెప్పొద్దు. నీగురించి ఏవీ చెప్పొద్దు! ఈ రోజు మనం సంతోషంగా గడపాలి."

—అంటూనే వంటగదివేపు నడిచింది రమ!

రమ కాపురంచేస్తున్న తీరు, ఆమె భర్త మంచితనం, ఆ ఇంటి వాతావరణం అన్నీ అవగాహనచేసుకున్నాక సుశీలకు అసూయ చెలరేగింది!

నేనే ఆనాడు మాట వినివుంటే ఈ స్థానంలో వుండవలసింది రమ కాదు— నేను ! సుశీల మనసులో అనేక రకాల ఆలోచన్లు ముసురుతున్నాయి.

వంటగదిలో నుండి వస్తూనే తన వాగ్ధాటి మళ్ళీ సుశీలమీద ప్రయోగించింది రమ. "ఏదిఏమైనా మొత్తం మీద మా సంసారం ఎటువంటి అవరోధాలు రాకుండా హాయిగా సాగిపోతోంది. మా వారి ఉద్యోగం చిన్నదే అయినా వచ్చిందాంతో హాయిగా గడుపుకుంటున్నాం" ఇంకా ఏదో చెప్పుకుపోతూనే వుంది రమ. రమ అంటున్న మాటలన్నీ సుశీల హృదయంలో సూదుల్లా నాటుకుంటున్నాయి.

'ఎన్నో బంగారు కలలు కన్నాను ! విలువైన జీవితం గడపాలనుకున్నాను ! గోరువంక కూడా అందంగా వుంటేనే, చిలకాగోరింకా అని నలుగురూ అంటారని భ్రమపడి రాజాని పెళ్లి చేసుకున్నాను! కానీ ఇప్పుడేమైంది. ఎన్నో ఆశలతో నింపుకున్న నా అద్దాలమేడ చితికిపోయింది.'

తన హృదయంలో ఏదో ఆరాటం అగ్నిగుండంలా మండుతోంది. కళ్ళ వెంట కారుతున్న కన్నీరు చెక్కిళ్లను తడుపుతున్నాయి. మనస్సు అధీనం తప్పిపోయింది. ఎంత ప్రయత్నించినా అక్కడ వుండటం తనకు చేతకాలేదు. రమ పిలుస్తున్నా వినిపించుకోకుండా ఇంటికి బయల్దేరింది సుశీల !

* * *

ఇంట్లో అడుగుపెడుతూనే అందరి ముఖాల్లోకి ఆశ్చర్యంగా చూసింది సుశీల.

ఇంటి వాతావరణం మౌనాన్ని పాటిస్తూ అందరి ముఖాలు కళావిహీనంగా వున్నాయి. ఎవ్వరిలోనూ చలనం లేదు. 'బాలీ' వేసిన సెంటిమెటల్ చిత్రంలా వుంది. ఆ దృశ్యం. సుశీలకు ఆ పరిస్థితి అర్థంకాలేదు. ఎవర్ని పిల్చినా, ఎవరూ పలికే స్థితిలో లేరు. సుశీల అయోమయంగా రఘు కూర్చున్న సోఫా వద్దకు నడిచింది !

"అన్నయ్యా ఏం జరిగింది" అంది ఆత్రంగా.

రఘు కళ్ళు తనముందున్న టీపాయ్ మీదికి తిరిగేయి. సుశీల మౌనంగా ఆ వేపు చూసింది. కళ్ళు చీకట్లు క్రమ్మాయ్. రక్తనాళాల్లో ప్రవాహం స్తంభించిపోయింది. ఒణుకుతున్న చేతుల్తో టీపాయ్‌మీద వున్న పేపర్ అందుకుంది.

ఈ ఫోటో ఆయన్దే. ఆయనే- పేరు మోసిన స్మగ్లర్‌గా ఇంతకాలం చలామణీ అవుతూ, నిన్న రాత్రి ఐదులక్షల విలువ చేసే బంగారంతో పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు

సుశీల శరీరం బిగుసుకుపోయింది. అమ్మా అని గావుకేక పెట్టి మొదలు నరికిన తాడిలా నేలకు ఒరిగింది. హఠాత్ పరిణామానికి పెట్టిన కేకతో అందరిలోనూ చలనం ఏర్పడింది.